
కొడంగల్ పట్టణం

| మండలాల వారీగా | పోలింగ్ స్టేషన్లు | ఓటర్లు.. |
|---|---|---|
| కొడంగల్ | 41 | 36,828 |
| బొంరాస్‌పేట | 38 | 30,055 |
| దౌల్తాబాద్ | 46 | 38,370 |
| కోస్గి | 39 | 33,879 |
| మద్దూర్ | 44 | 36,203 |
| దుద్యాల | 29 | 22,723 |
| గుండుమాల్ | 20 | 16, 372 |
| కొత్తపల్లి | 18 | 15,821 |

# మూడు సార్లు మారిన నియోజకవర్గ స్వరూపం..

## మూడు రాష్ట్రాలు, మూడు జిల్లాలుగా కొనసాగిన కొడంగల్ ప్రాతినిధ్యం..

కొడంగల్, నవంబర్ 11 : కొడంగల్ నియోజకవర్గం 1952 ఏర్పడింది. అప్పట్లో కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లాలో భాగంగా కొడంగల్ నియోజకవర్గం ఉండేది. కర్ణాటక నుంచి వీడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో కొడంగల్ నియోజకవర్గంగా ఏర్పడింది.. ఆనాటి నియోజకవర్గంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, దామరగిద్ద ఇలా ఆరు మండలాలతో పాటు కోయిలకొండ మండలంలోని కొన్ని గ్రామాలు కలిసి ఉండేవి. ఆ తరువాత మండలాల విభజన జరిగినప్పుడు కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్‌లు మొత్తంగా 5 మండలాలు ఏర్పడ్డాయి, దామరగిద్దతో పాటు కోయిల్ కొండలోని కొన్ని గ్రామాలు నారాయణపేట జిల్లాలో కలపబడ్డాయి. తెలంగాణ ఉద్యమం తరువాత 2012 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయింది. రాష్ట్రం విడిపోయిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో 2014 సంవత్సరంలో జిల్లాల పునర్విభజన కొనసాగింది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లాలో, అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూర్ మండలాలు ప్రస్తుతం నారాయణపేట జిల్లాలో కలవబడ్డాయి. 2018 సంవత్సరంలో మండలాల విభజనలో వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, దౌల్తాబాద్‌లకు యథావిధిగా ఎటువంటి మార్పులు చేపట్టలేదు. కాగా, బొంరాస్‌పేట మండలంలో బొంరాస్‌పేటతోపాటు దుద్యాల మండలం ఏర్పడింది. కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా కోస్గి మండల పరిధిలో గుండుమాల్, మద్దూర్ మండల పరిధిలో కొత్తపల్లి ఇలా రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో కొత్త మండలాలతో కలుపుకొని మొత్తంగా 8 మండలాలు ఏర్పడ్డాయి. కొడంగల్ నియోజకవర్గంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాలతో ముడిపడి పోయింది. ప్రస్తుతం కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలు అసెంబ్లీ నియోజకవర్గంగా కొనసాగుతున్నది. దీంతో కొడంగల్ నియోజకవర్గం మూడు సార్లు నియోజకవర్గ స్వరూపం మారగా, మూడు సార్లు రాష్ట్రాలుగా విడిపోవడం, మూడు సార్లు జిల్లాలుగా విడిపోవడం వంటి సందర్భం చోటుచేసుకున్నది. ప్రస్తుతం వికారాబాద్‌లోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలు, నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు పరిధిలోకి అసెంబ్లీ ఎన్నిక జరుగుతున్నది. ఏర్పడిన కొత్త మండలాలతో ప్రజలకు పాలనా సౌకర్యాలు చాలా వరకు చేరువయ్యాయి. కొత్తగా ఏర్పడిన మండలాల్లో కార్యాలయాలు ఏర్పడగా, అధికారుల నియామకాలు కూడా పూర్తి కాబడి ఎక్కడి మండలాల్లో అక్కడ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం.. నియోకవర్గంలోని ఓటర్లు.. మొత్తం 2,30,251 ఇందులో పురుషులు 1,14,140, స్త్రీలు..1,16,099, ఇతరులు 12 మంది ఉన్నారు.



కోస్గి మున్సిపల్ కార్యాలయం


బొంరాస్‌పేట మండలంలోని ఓ తండా

# పార్కులకు నిలయం ఎల్బీ నగర్

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఇందిరా ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌ను కలిసి ప్రచారం

ఎల్బీనగర్, నవంబర్ 10 : ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని పార్కులకు నిలయంగా మార్చామని, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా సరూర్‌నగర్ ఇందిరా ప్రియదర్శిని పార్కును సందర్శించి వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. అనంతరం ఓపెన్ జిమ్‌లో యువకులతో కలిసి వ్యాయామం చేయడంతో పాటు కొద్ది సేపు షటిల్ ఆడారు. అనంతరం వాకర్స్‌తో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లో చేసిన అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని వాకర్స్‌ను కోరారు. ఇందిరా ప్రియదర్శిని పార్కును 2007లోనే సుందరంగా తీర్చిదిద్దామని, తాజాగా ఈ పార్కులో మరిన్ని హంగులను సమకూర్చామన్నారు. ప్రజల కోసం కామినేని ఫ్లై ఓవర్ కింద ఆక్సిజన్ పార్కు, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. సరూర్‌నగర్ చెరువును కూడా సుందరీకరించి అందులో బోటు షికారును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయ మాటలు నమ్మొద్దని, నిత్యం ప్రజల్లో ఉండే నాయకులను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, మహేందర్ యాదవ్, రవి, భాస్కర్ గంగపుత్ర, తిలక్, సత్యం, జైశంకర్, అశోక్, సీనియర్ నాయకులు వెంకటేశ్ గౌడ్, రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్‌గౌడ్, మైసయ్య, సీతారాములు పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో ఇందిరా ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

# ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..

వికారాబాద్, నవంబర్ 11 : చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, టైగర్ కృష్ణ సమక్షంలో శనివారం పలువురు బీఆర్ఎస్‌లో చేశారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గౌండ్ల బాలరాజ్ గౌడ్, బురాన్‌పల్లి , ఎన్నెపల్లి గ్రామాల నాయకులు గులాబీ గూటికి చేరారు. పార్టీలో చేరినవారిలో సర్పంచ్ గౌండ్ల సాయి, గ్రామ పెద్దలు అంజయ్య, జంగయ్య, అంజయ్య, పరమేశ్, పరమయ్య, మల్లయ్య, శంకర్, రాములు నాయక్ తదితరులు ఉన్నారు.


పలువురిని గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

# గులాబీ గూటికి.. మైనార్టీ నేతలు..

మణికొండ, నవంబర్ 11: రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ గండిపేట్‌లో కాంగ్రెస్ మైనార్టీ విభాగానికి చెందిన సుమారు 300 మంది మైనార్టీ నాయకులు స్థానిక కౌన్సిలర్లు గోపాల సునీత, విజిత ప్రశాంత్ యాదవ్‌ల నేతృత్వంలో శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ గులాబీ కండువాలు కప్పి వారిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.